క్లుప్తంగా

జీడీపీకి సందర్శకుల తాకిడి



గాజులదిన్నె ప్రాజెక్టు వద్ద జలకాలాడుతున్న సందర్శకులు

గోనెగండ్ల: బక్రీద్ పండుగను పురస్కరించుకొని మంగళవారం ముస్లింలు కుటుంబ సమేతంగా గాజులదిన్నె ప్రాజెక్టు వద్దకు చేరుకుని సరదాగా గడిపారు. కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులతో కలిసి కార్లు, బైక్‌లు, ఆటోలలో ప్రాజెక్టు వద్దకు చేరుకుని ఫొటోలు దిగుతూ సందడి చేశారు. కబుర్లు చెప్పుకుంటూ ఇంటి నుంచి తెచ్చుకున్న ఆహారం, వంటకాలతో బంతి భోజనం చేశారు. అనంతరం ప్రాజెక్టు గేట్లు, పరిసరాలను సందర్శించి నీటిలో జలకాలాడుతూ సరదగా గడిపారు. సందర్శకుల రాకతో ప్రాజెక్టు వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు పండగ వాతావరణం కనిపించింది.

ఘనంగా గ్యారాతారీఖ్ వేడుకలు



స్వామి వారి సమాధి వద్ద ప్రార్థన చేస్తున్న ధర్మకర్త

కౌతాళం: మండల కేంద్రంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో మంగళవారం గ్యారాతారిఖ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు, ప్రార్థనలు చేశారు. దర్గా పరిసర ప్రాంతాల్లో భక్తులతో సందడి నెలకొంది. బక్రీద్ పండుగ మరుసటి రోజే గ్యారాతారిఖ్ కలిసిరావడంతో దర్గాకు భక్తులు అధికంగా తరలివచ్చారు. అంతకుముందు తెల్లవారుజామున 5 గంటలకు ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాష చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు. పలువురు భక్తులు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు.భక్తులందరికీ ధర్మకర్త అన్నదానం ఏర్పాటు చేశారు.

స్టూడెంట్ కిట్ల పంపిణీ



స్టూడెంట్ కిట్లను పంపిణీ చేస్తున్న ఎరిగేరి సర్పంచ్ గోవిందు

కౌతాళం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన విద్యా కానుక కిట్‌లను మంగళవారం ఆయా గ్రామాల్లో అధికార పార్టీ నాయకులు, వైఎస్సార్‌సీపీ గ్రామ సర్పంచ్‌ల చేతుల మీదుగా పంపిణీ చేశారు. మండల పరిధిలోని ఎరిగేరి ఉన్నత పాఠశాల్లో టీడీపీ నాయకుడు సురేష్‌నాయుడు, సతీష్‌నాయుడు, ప్రాథమిక పాఠశాల్లో గ్రామ సర్పంచ్ గోవిందు, వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ నీలకంఠరెడ్డి, కామవరం గ్రామంలో గ్రామ నాయకుడు తిక్కయ్య, తిప్పలదొడ్డిలో గ్రామ టీడీపీ నాయకుడు మల్లయ్య చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గోవిందు తదితరులు మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకుని గ్రామానికి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పార్టీ నాయకులు, ఉపాధ్యాయులతో కలిసి పరిశీలించారు.

వెయిటేజ్ మార్కులు కలపాలి



ఎంఈఓలకు వినతిపత్రం అందజేస్తున్న సీఆర్పీలు

గోనెగండ్ల: త్వరలో వెలువడనున్న ఏపీ డీఎస్సీ నోటిఫికేషన్‌లో సమగ్ర శిక్షలో పనిచేస్తున్న వారికీ, ఉపాధ్యాయ పోస్టులకు అర్హత కలిగిన వారందరికీ వెయిటేజ్ మార్కులు కలపాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు పుల్లన్న, రవి కోరారు. వారు మంగళవారం స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో ఎంఈఓలు రామాంజనేయులు, నీలకంఠలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులందరూ రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వర్తిస్తున్నారని, వారందరికీ డీఎస్సీలో వెయిటేజ్ మార్కులు కలపాలని కోరారు. సీఆర్పీలు గోవింద రాజులు, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

దేవనకొండ: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న శ్రీనివాసులు 20 రోజుల క్రితం గుండెపోటుకు గురై మృతిచెందిన విషయం విధితమే. ఈ మేరకు మంగళవారం బాధిత కుటుంబాన్ని సీఐ శ్రీనివాసులు పరామర్శించారు. రూ.50 వేలు నగదును బాధిత కుటుంబానికి అందించారు. ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందేలా చర్యలు తీసుకుంటామని వారికి సీఐ హామీ ఇచ్చారు. విధి నిర్వహణలో హోంగార్డు శ్రీనివాసులు మృతిచెందడం బాధాకరమన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. పోలీసు సిబ్బంది ఉన్నారు.

జూన్ మాసం.. ఫీజుల భారం

- ప్రైవేట్ స్కూళ్లలో అమాంతం పెరిగిన ఫీజులు
- తల్లిదండ్రులకు ఆర్థిక భారం
- అప్పులు చేసి మరీ చదివించాల్సిన పరిస్థితి



గోనెగండ్లలో ఓ దుకాణంలో అమ్మకానికి ఉంచిన స్కూలు బ్యాగులు

గోనెగండ్ల: తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివించాలని ఆశపడతారు. ప్రతిఒక్కరూ తమ శక్తి మేరకు పిల్లలను మంచి పాఠశాలల్లో చదివిస్తుంటారు. అయితే ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో పిల్లలను చదివించాలంటే కూలీ పనులు చేసుకునేవారు, చిరు వ్యాపారులు, చిరుద్యోగులు ఫీజు చెల్లించేందుకు ఆస్తులు అమ్ముకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కాన్వెంట్‌లో చదివించేందుకు పిల్లల తల్లిదండ్రులు మొగ్గు చూపుతున్నారనేది ఎవరైనా అంగీకరించాల్సిన వాస్తవం. అయితే ప్రైవేట్ స్కూళ్లలో చదివించేందుకు ఏడాదికి రూ.వేలల్లో ఖర్చవుతుంది. నెలకు రూ. 20 వేలు సంపాదించే వారైతే ఇద్దరు పిల్లలను చదివించడం భారంగా మారుతోంది. అయినప్పటికీ ఇంగ్లిషు మీడియం చదువు మాన్పించలేక, ఏటా ఖర్చులు భరించలేక ఆగచాట్లు పడుతున్నారు. వేసవి సెలవుల అనంతరం జూన్‌లో స్కూళ్ల రీఓపెనింగ్ అంటే విద్యార్థుల తల్లిదండ్రులు బెంబేలెత్తిపోతున్నారు. కాన్వెంట్ ఫీజు, బస్సు ఫీజు, పుస్తకాలు, యూనిఫాం వంటి వాటి కోసం రూ.వేలల్లో ఖర్చు చేయాల్సి వస్తోంది. మండలంలో మొత్తం 9 ప్రైవేట్ స్కూళ్లు ఉండగా అందులో దాదాపు 1500 మంది విద్యార్థులు చదువుతున్నారు.

ప్రైవేటు బడికి వెళ్లాలంటే..

నిత్యావసరాల ధరలు పెరిగిపోయి బతుకు భారమైన ఈ రోజుల్లో తల్లిదండ్రులకు పిల్లల చదువులు అదనపు భారంగా మారాయి. మూడేళ్ల పిల్లోడిని కాన్వెంట్‌లో చేర్పించేందుకు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చువస్తుంది. అడ్మిషన్ ఫీజు, స్కూలు ఫీజు, యూనిఫాం, బూట్లు, పుస్తకాలతో పాటు, బస్సు ఫీజులు చెల్లించాలి. ఇక కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల మోత తప్పడం లేదు.

అంతా బాదుడే

ప్రైవేట్ స్కూళ్లలో ఎల్‌కేజీ నుంచి ఐదో తరగతి వరకూ విద్యార్థుల నోట్ పుస్తకాలు, యూనిఫాం వరకూ అన్నీ రెట్టింపు ధరలే. బస్సు, ఫీజు ఒక్కటీ ఒక్కో విద్యార్థికి ప్రయాణించే ఊరు, దూరాన్ని బట్టి రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకూ ఖర్చవుతోంది. దీంతో పిల్లల చదువు కొనలేక తల్లిదండ్రులు తల్లడిల్లుతున్నారు. అవసరమైన సబ్జెక్టులు నాలుగే అయినప్పటికీ ఊహ తెలియని పిల్లాడికి కూడా డ్రాయింగ్, జీకే, గ్రామర్, హిందీ, సైన్స్ అంటూ రకరకాల పుస్తకాలను తల్లిదండ్రులచే కొనిపిస్తున్నారు. విద్యార్థుల ఫీజులపై విద్యా శాఖ నిర్దిష్ట విధానాన్ని ప్రకటించినప్పటికీ ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు వాటిని పాటించడం లేదు. ప్రైవేట్, టెక్నో స్కూళ్ల మధ్య పోటీ తీవ్రంగా ఉంటోంది. దీంతో ప్రైవేట్ బడుల్లో చేరాలని భారీ ఎత్తున ప్రచారం చేస్తున్నాయి. ఇలాంటి తరుణంలో తమ పిల్లలను ఎక్కడ చదివించాలో అర్థంగాక తల్లిదండ్రులు అయోమయానికి గురవుతున్నారు. చాలా మంది అప్పు చేసి మరీ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చేరుస్తున్నారు. ప్రైవేట్ స్కూళ్లల్లో ఒక్కో విద్యార్థికి అడ్మిషన్ ఫీజు రూ.2 వేల నుంచి రూ.6 వేలు, జత యూనిఫాంకు రూ.1200, పుస్తకాలు, స్టడీ మెటీరియల్, నోట్‌బుక్స్ రూ.2 వేల నుంచి రూ.6 వేల వరకూ వసూలు చేస్తున్నారు. బూట్లకు రూ.300, ఆటో చార్జీ నెలకు రూ.500 నుంచి రూ.1200, స్టేషనరీ కలిపి రూ.500 మొత్తం రూ.8 వేల నుంచి రూ.10 వేలు ఖర్చు చేయాల్సి వస్తోందని తల్లిదండ్రులు చెబుతున్నారు. కొన్ని కాన్వెంట్లలో బోధించే సిలబస్ ప్రైవేట్ కావడంతో పుస్తకాల బడ్జెట్ మరింత పెరుగుతోంది. ప్రభుత్వం నుంచి పాఠ్య పుస్తకాలు కొనాలన్న నిబంధన అమలు కావడం లేదు. అదిగాక గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఫీజులు ఎల్‌కేజీ స్థాయిలోనూ పెరిగాయి. ఈ ఫీజులను ఒకటి లేదా రెండు టర్మ్‌లుగా కాన్వెంట్ల యాజమాన్యాలు వసూలు చేస్తున్నాయి. ఖర్చులు ఇంతగా ఉన్నప్పటికీ కాన్వెంట్లు, ప్రైవేట్ స్కూళ్లలో పూర్తిస్థాయిలో వసతులు ఉంటాయనుకుంటే ప్రశ్నార్థకమే. అరకర వసతుల మధ్య విద్యాశాఖ నిబంధనలు అతిక్రమించి మరీ పాఠశాలలను నిర్వహిస్తున్నారు. విద్యా శాఖ అధికారులు, ప్రభుత్వం చర్యలు చేపట్టి ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులను నియంత్రించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

నిబంధనలు పాటించాలి



ఒకటి నుంచి పదో తరగతి వరకూ ప్రభుత్వం సమకూర్చే పాఠ్య పుస్తకాలనే మాత్రమే కొనుగోలు చేయాలి. అందుకనుగుణంగానే పరీక్షలు నిర్వహించాలి. ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్ల యాజమాన్యాలు అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటాం. స్కూళ్ల యాజమాన్యాలు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి.

– నీలకంఠ, ఎంఈఓ, గోనెగండ్ల

అలస్యంగా వికసించిన మే పుష్పం



పెద్దకడబూరులో వికసించిన మే పుష్పం

పెద్దకడబూరు: మండల కేంద్రంలోని బాలవికాస్ ప్రైవేటు పాఠశాల ఆవరణలో మంగళవారం మే పుష్పం వికసించింది. పాఠశాల ఆవరణలో ఈ పుష్పం ఉండడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఎంతో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ విశ్వనాథ్ రెడ్డి మాట్లాడుతూ.. గత ఐదేళ్ల నుంచి మే నెలలో కనిపించే ఈ పుష్పం ఈ సారి కాస్త ఆలస్యంగా వికసించినట్లు చెప్పారు. రెండు చెట్లు ఉండగా ఈసారి మాత్రం ఒకటే పుష్పించినట్లు తెలిపారు. ఏడాదికి ఒకసారే మే పుష్పం వికసిస్తుందని, ఆ నెల తర్వాత చెట్టుకు సంబంధించిన ఆనవాళ్లు ఏవీ కనిపించవన్నారు.



నాట్లు వేసేందుకు నారు సిద్ధం చేస్తున్న కూలీలు



జొహరాపురంలో ఉల్లి నారు నాటుతున్న వ్యవసాయ కూలీలు

జోరుగా ఉల్లినాట్లు

నందవరం: వరుణుడు పలకరిస్తున్న వేళ.. పొలాల్లో హలాల స్వవడులు, కూలీల సందడి నెలకొంది. మండలంలో జోరుగా ఉల్లినాట్లు సాగుతుండటంతో పొలాలన్నీ కళకళలాడుతున్నాయి. నదితీర ప్రాంతం, బోరు, బావుల కింద రైతులు ఉల్లినాట్లకు దిగారు. గంగవరం, నదికైరవాడి, జొహరాపురం, సోమలగూడూరు, పెద్దకొత్తిలి, చిన్నకొత్తిలి, కనకవీడు, పూలచింత గ్రామాల్లో నాట్లు మొదలయ్యాయి. ఇప్పటివరకు మండలంలో 75 ఎకరాల్లో నాట్లు వేశారు. అలాగే ఆయా గ్రామాల్లో మిరప సాగు చేసేందుకు మిరప బెడ్లను సిద్ధం చేసుకుంటున్నారు. మిరప బెడ్లలలో కూలీల సవ్వడి సాగుతుంది. ఇప్పుడిప్పుడే మార్కెట్‌లో ఉల్లి ధరలు పెరుగుతుండడంతో రైతులు ఉల్లిసాగుపై ఆసక్తి చూపుతున్నారు. వడివడిగా నాట్లు వేసే పనిలో వ్యవసాయ కూలీలు నిమగ్నమయ్యారు.

రజక విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



బహుమతులను అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

ఆదోని రూరల్: ఆదోని రజక విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల కార్యక్రమాన్ని మంగళవారం పేటవీరభద్ర స్వామి ఆలయంలో రిటైర్డ్ ఎస్‌డబ్ల్యూ గోవిందప్ప అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా రజక ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు నరసింహరాజు పాల్గొని మాట్లాడారు. గత 13 సంవత్సరాల నుంచి 10వ తరగతి, ఇంటర్మీడియెట్‌లో అత్యధిక మార్కులు సాధించిన రజక వర్గానికి చెందిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందిస్తున్నట్లు చెప్పారు. మడివాళస్వామి ప్రతిమ, నోటు పుస్తకాలను, స్టడీ మెటీరియల్స్ అందించామన్నారు. సాంకేతిక కాలంలో రజకులు విద్య, ఉద్యోగ, ఆర్థిక, సామాజికంగా అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రజక కులస్తులు, ఉద్యోగులు నాగరాజు, సతీష్, కిషోర్, రామన్న, ఈరన్న, ఉసేని, కౌన్సిలర్ నాగలక్ష్మి, మద్దిలేటి, రాఘవేంద్ర, సావిత్రి, రవి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వ్యాధుల నివారణపై అవగాహన



ధణాపురం హెల్త్ సెంటర్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ వై.ప్రవీణ్‌కుమార్

ఆదోనిసెంట్రల్: ఆదోని ఏరియా ఆస్పత్రిని మంగళవారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ సందర్శించారు. ఆస్పత్రిలోని రికార్డులను తనిఖీ చేసి, వైద్య సిబ్బందితో సమావేశమయ్యారు. అసంక్రమిత వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. క్యాన్సర్ స్క్రీనింగ్‌పై మూడు రోజులపాటు శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. చికిత్స కన్నా నివారణ మిన్న అనే నానుడిని బట్టి కేన్సర్ నివారణ గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. సాధారణంగా నోటి, రొమ్ము, గర్భాశయ ముఖద్వారం కేన్సర్‌లు సంక్రమిస్తాయని, వీటిని వీలైనంత త్వరగా గుర్తించి చికిత్స చేయించుకోవడం వల్ల నయమవుతుందన్నారు. ఈ విషయాలపై సీహెచ్‌ఓలు, ఏఎన్‌ఎంలు ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఎఫ్‌డీపీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ బాలమురళి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సత్యవతి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ఆదోని రూరల్: గర్భిణులకు ఎప్పటికప్పుడు ఆరోగ్య సలహాలు తెలియజేయాలని డీఎంహెచ్‌ఓ వై.ప్రవీణ్‌కుమార్ సూచించారు. ఈ మేరకు మంగళవారం ధణాపురం గ్రామంలోని హెల్త్ సెంటర్‌ను ఆయన తనిఖీ చేశారు. వైద్య సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. హెల్త్ సెంటర్‌కు వచ్చే రోగులకు అన్ని వైద్య సదుపాయాలు ఉండేలా చూసుకోవాలన్నారు. ఏదైనా అత్యవసరమైతే ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి రెఫర్ చేయాలన్నారు. వర్షాలు కురుస్తున్నందువల్ల సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామస్తులకు తగిన సూచనలు, సలహాలు తెలియజేయాలన్నారు. డాక్టర్ ఇబ్రహీం, ఎంపీహెచ్ఈఓ ఉమాపతి, హెల్త్ సూపర్‌వైజర్ చంద్రమోహన్, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

ఉపాధ్యాయులను నియమించాలి

ఆదోని రూరల్: పట్టణంలోని ఆర్‌ఆర్ లేబర్ కాలనీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో కేవలం నలుగురు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారని, అదనంగా 16 మంది ఉపాధ్యాయులను నియమించాలని ఫెడరేషన్ కమిటీ ఉపాధ్యక్షురాలు బోయ జ్యోతి, కల్లుబావిరాజు ఆదోని ఎమ్మెల్యే పార్థసారథిని కోరారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేశారు. ఫెడరేషన్ కమిటీ ఉపాధ్యక్షురాలు బోయ జ్యోతి, కల్లుబావిరాజు మాట్లాడుతూ.. పాఠశాలలో 850 మంది విద్యార్థులు చదువుకుంటున్నారన్నారు. ఇటీవల వెలువడిన 10వ తరగతిలో ఫలితాల్లో పట్టణంలో మొదటి స్థానంలో నిలిచినట్లు చెప్పారు. ఈ ఏడాది మరో 250 మంది దాకా అడ్మిషన్లు నమోద య్యే అవకాశం ఉందని, నలుగురు ఉపాధ్యాయులు మాత్రమే ఉండడంతో విద్యార్థులు చదువులో వెనకబడే పరిస్థితి నెలకొందన్నారు. పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం జరుగుతోందని, వాటిని పూర్తి చేయించి, ఉపాధ్యాయులను నియమించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కాలనీవాసులు విజయ్, వీరేష్, రామకృష్ణ, ఈరన్న, రవి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యను సృష్టించొద్దు



దుకాణాల యజమానులకు సూచనలు చేస్తున్న ట్రాఫిక్ సీఐ మంజునాథ్

ఆదోని అర్బన్: పట్టణంలో ట్రాఫిక్ సమస్యలను సృష్టించవద్దని ట్రాఫిక్ సీఐ మంజునాథ్ దుకాణదారులకు సూచించారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో.. భీమా సర్కిల్ నుంచి ఓల్డ్ బ్రిడ్జి వరకు ఉన్న దుకాణాల యజమానులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు తెలియజేశారు. దుకాణాలకు వచ్చే వారి వాహనాలను రోడ్డు మీద నిలపరాదన్నారు. దుకాణాల ముందు ఉన్న ఫుట్‌పాత్ స్థలాన్ని ఆక్రమించి బంకులు, తోపుడు బండ్లను ఏర్పాటు చేయడం వల్ల రహదారిపై వెళ్లే ప్రజలకు, వాహనదారులకు అంతరాయం కలిగి ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందన్నారు. దుకాణాల ముందు యజమానులు నో పార్కింగ్ బోర్డులు పెట్టాలని, వాచ్‌మెన్‌ను నియమించుకుని వాహనాలు రాంగ్ పార్కింగ్ చేయకుండా చూసుకోవాలన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే దుకాణదారులకు నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దహన వాటిక నిధులు ఏమయ్యాయి?



శ్మశాన వాటికను పరిశీలిస్తున్న కేజీబీఎస్ రాష్ట్ర కన్వీనర్ ఎం.డి.ఆనంద్‌బాబు

ఆదోని రూరల్: ఆదోనిలోని హిందూ శ్మశానంలో దహన వాటిక నిర్మాణానికి మంజూరైన రూ.1.30 కోట్లు ఏమయ్యాయని కేజీబీఎస్ (కాటికాపరి, గుంతలు తీసే బేగరుల సంఘం) రాష్ట్ర కన్వీనర్ ఎం.డి. ఆనంద్‌బాబు ప్రశ్నించారు. ఆ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఆదోని పట్టణంలోని తిక్కస్వామి దర్గా వెనక ఉన్న హిందూ శ్మశాన వాటికను ఆ సంఘం రాష్ట్ర కన్వీనర్ యం.డి.ఆనందబాబు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.తిక్కప్ప, ఎస్.జి.కృష్ణ, ఉపాధ్యక్షులు యువరాజు పరిశీలించారు. శ్మశానంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాలకుల నిర్లక్ష్యం కారణంగా పట్టణంలో అనేక రకాల సమస్యలు పేరుకుపోయాయన్నారు. బతికున్నప్పుడు భరించే సమస్యలు ఒకటైతే, చనిపోయిన వారిని శ్మశానంలో పూడ్చేందుకు సైతం సమస్యలు తప్పడం లేదని వాపోయారు. జిల్లాలో మొదటి మున్సిపాలిటీగా ఉన్న ఆదోని పట్టణంలో పాలకులు ఎవరనే దానితో సంబంధం లేకుండా అభివృద్ధి లేకుండా పోయిందని, లక్షలు ఖర్చుపెట్టి తెచ్చిన బర్నింగ్ మిషన్, బాయిలర్లు ఎండ, వానకు తుప్పు పట్టి పోతున్నాయని చెప్పారు. జిల్లా అధికారులు కలుగజేసుకుని దహన వాటిక నిధులు రూ.కోటి కొల్లగొట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే శ్మశాన వాటిక చుట్టూ ప్రహరీ నిర్మించాలని కోరారు. శ్మశాన వాటికలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా రక్షణ కల్పించాలన్నారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. కేజీబీఎస్ నాయకులు వీరేష్, తాయన్న, మారయ్య, మునిస్వామి, నాగేశులు, మద్దిలేటి, శ్రీరాములు, ఉరుకుంద తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు



గర్భిణులకు రక్త పరీక్షలు చేస్తున్న డాక్టర్ రజిత

కోసిగి: గర్భిణులు ప్రతినెలా రక్త పరీక్షలు చేయించుకుని ఆరోగ్య సలహాలు, సూచనలు పాటించాలని కోసిగి ప్రాథమిక వైద్యాధికారిణి రజిత సూచించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కందుకూరు, కామన్‌దొడ్డి, ఆర్లబండ గ్రామాల గర్భిణులకు ఆమె రక్త పరీక్షలు చేసి సలహాలు, సూచనలు చేశారు. ఆయా గ్రామాల పరిధిలోని 56 మంది గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గర్భిణులకు ప్రతి మంగళ, శుక్రవారాల్లో రక్త పరీక్షలు చేసి ఆరోగ్య సలహాలు ఇస్తున్నట్లు తెలిపారు. ప్రసవం సురక్షితంగా జరిగేలా ఎప్పటికప్పుడు గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక్ష చర్యలు తీసుకుంటున్నాట్లు వివరించారు. రక్తహీనత ఉన్న వారిని గుర్తించి ఐరన్ ట్యాబ్లెట్స్ అందించారు. మరికొందరికీ రక్తం ఎక్కించే ఏర్పాటు చేశారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు తగినంతగా తీసుకోవాలని సూచించారు. ల్యాబ్ టెక్నీషియన్ మల్లికార్జున, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

విరుపాపురంలో ధార్మిక కార్యక్రమాలు

ఆదోని అర్బన్: మానవుడు ఆచరించిన కర్మల ఫలితాల నుంచి తప్పించుకోలేడని, పుణ్యమైనా, పాపమైనా దాని ఫలితాన్ని పొందుతాడని తిరుమల తిరుపతి దేవస్థానములు (టీటీడీ) హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మండలంలోని విరుపాపురం గ్రామంలోని ఆంజేయస్వామి ఆలయంలో ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక పని చేసేటప్పుడు అది మంచిదా? లేదా చెడ్డదా? దాని వల్ల ఏ విధమైన ఫలం రాబోతుందని గ్రహించక కర్మలాచరించేవాడు తత్ఫలం అనుభవించవలసిందేనన్న భావన మనసులో ఉంటే మానవుడు తప్పిదాలు చేయడని గుర్తు చేశారు. గ్రామ సర్పంచ్ ప్రహ్లాదయాదవ్, శ్రీవారి సేవకులు జి.సత్యనారాయణ, తితిదే ధర్మ ప్రచార మండలి సభ్యులు నాయకంటి భీమిరెడ్డి, సోమేశ్వరరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



ఆదోని అర్బన్: పట్టణంలోని మార్కెట్ యార్డు సమీపంలో అమరావతినగర్‌కు వెళ్లే రహదారిలో ఓ చెట్టు కింద గుర్తు తెలియని వ్యక్తి (45) మంగళవారం మృతిచెందారు. దీనిపై స్థానికులు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని పరిసర ప్రాంతాల్లో విచారణ చేయగా మృతి చెందిన వ్యక్తి ఆ ప్రాంతంలో భిక్షాటన చేస్తూ జీవించేవాడని తెలిసింది. అతని సొంత వివరాలు తెలియరాలేదు. పెద్దల సమక్షంలో పంచనామా చేసి మున్సిపల్ అధికారులకు మృతదేహాన్ని అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య



విద్యార్థినులకు స్టూడెంట్ కిట్లను అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, అధికారులు

ఆదోని సెంట్రల్: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్‌ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్ల పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది. ప్రధానోపాధ్యాయుడు రమేష్ నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేట్ బడులలోనే నాణ్యమైన విద్య అందుతుందనే అపోహల నుంచి బయటికి రావాలన్నారు. తాను కూడా ప్రభుత్వ బడిలో చదువుకున్న వాడినని గుర్తు చేశారు. పిల్లలను చదివించడానికి తల్లిదండ్రులు ఇబ్బంది పడకూడదని ప్రభుత్వమే ఉచితంగా పుస్తకాలు, బ్యాగులు, షూలు, బట్టలు వంటివి పంపిణీ చేస్తోందని చెప్పారు. అలాగే రుచికరమైన మధ్యాహ్న భోజనం భోజనం అందిస్తున్నారని తెలిపారు. విద్యార్థులు కూడా ప్రభుత్వం అందిస్తున్న సహాయ, సహకారాలను అందిపుచ్చుకుని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులకు అండగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం 10వ తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, అందుకు కృషి చేసిన ఉపాధ్యాయులను సన్మానించారు. డిప్యూటి ఈఓ వెంకటరమణారెడ్డి, ఎంఈఓలు రాజేంద్రప్రసాద్, శ్రీనివాసులు,ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున, అలీం సిద్ధిఖీ తదితరులు పాల్గొన్నారు.

'పీఎం కిసాన్'ను సద్వినియోగం చేసుకోండి

ఆదోని రూరల్: పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ఆర్థిక సాయాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి సూచించారు. మంగళవారం సాయంత్రం ప్రధానమంత్రి నరేంద్రమోదీ వారణాసి నుంచి 17వ విడత పీఎం కిసాన్ నిధులు విడుదల కార్యక్రమాన్ని ఆరేకల్ గ్రామంలో లైవ్ వెబ్ క్యాస్ట్ ద్వారా రైతులకు ప్రదర్శించారు. రైతుల ఖాతాల్లోకి రూ.2 వేలు డీబీటీ ద్వారా జమ చేసినట్లు చెప్పారు. రైతులతో ముఖాముఖి అయ్యి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే పెట్టుబడి సాయాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆదోని మండలంలోని 21,774 మంది రైతులకు రూ.4,35,48,000 జమ చేసినట్లు చెప్పారు. ఏఓ అశోక్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ వి.లోహితప్రియ తదితరులు పాల్గొన్నారు.

మేదర్‌గేరిలో గుంతలమయంగా రోడ్లు

ఆదోని టౌన్: ఆదోని పట్టణం మేదర్‌గేరి మొదలుకొని కొత్త ఫ్లై ఓవర్ బ్రిడ్జి మీదుగా పాత ఆర్టీసీ కార్యాలయం వరకు రోడ్డు గుంతలమయంగా మారింది. ఫ్లై ఓవర్ బ్రిడ్జిపైన గుంతలు పడి ఇనుప కడ్డీలు, యాంగ్లర్లు బయటకు తేలాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గుంతలను పూడ్చడం, ఇనుప కడ్డీలు తేలిన స్థానంలో మరమ్మతులు చేయాల్సిన ఆర్‌అండ్‌బీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వేలాది మంది ప్రజలు గుంతలు పడిన రోడ్ల వల్ల ఇబ్బందులు పడుతున్నా ఎవరికీ పట్టకపోవడం బాధాకరం. సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు గుంతలు పడిన రోడ్లకు మరమ్మతులు చేపట్టి ప్రజల ఇబ్బందులను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



మేదర్‌గేరి ఫ్లైఓవర్ ఎదురుగా రోడ్డుపై గుంతలు







కొత్త ఫ్లైఓవర్‌పై గుంతలు పడి యాంగ్లర్లు తేలిన దృశ్యం, ఫ్లైఓవర్ రోడ్డుపై తేలిన ఇనుప కమ్మీలు, రెడ్‌చిల్లీ రెస్టారెంట్ సమీపంలో రోడ్డుపై గుంతలు పడిన దృశ్యం